ల”ని ప్రజలందరి హృదయాల్లో నాటుకుని వుంది. కొస్త ఉద్రేకంతో మాట్లాడే వాళ్లు పళ్లుబిగిస్తారు. ధైర్యంగా పార్టీలవారికి "వోటివ్వము" అని అంటారు. అయితే ఎవరికి వోటిస్తారు. స్వతంత్రులకిస్తారా? "ఏం లాభం? వాళ్ళు ప్రభుత్వాన్ని స్థాపించలేరు" పోనీ వ్యతిరేకంగా నిలబడి ప్రజలగోడు మొర పెడతారు కదా అని వాళ్ళకు వోటిస్తారా?

అయితే పార్టీలకు శాస్తి చెయ్యాలంటే ప్రజలొక పంథాను తొక్కాలి. అటువంటప్పుడు ఎవరినో సహాయంగా తీసుకోవాలి. ఇప్పుడు స్వతంత్రులే కనబడుతున్నారు, సహాయం చేయడానికి! ఆ సహాయాన్ని ప్రజలు వినియోగం చేసుకుని పరిస్థితుల్ని తమ చేతుల్లో పరిష్కరించుకోవడం కంటే ఇంకేం చెయ్యగలరు? చెయ్యవలసినదంతా పిల్లి మొగ్గ లేసి ప్రజల్తో చెలగాటాలాడుతున్న మూడో తరగతి నాయకోత్తములకు బుద్ధి చెప్పడమే!

కథానిక

# చుక్కల చీర

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఇంటికి వెళ్లేసరికి శాంత చాకలికి బట్టలు వేస్తోంది. ప్రక్క గదిలోకిపోయి కాఫీ కోసం చూస్తూ కూర్చున్నాను.

"ఎక్కడ కొన్నారమ్మా ఈ చీర?"

శాంతకి వాళ్ళన్నయ్య బొంబాయినించి పంపిన చీరనిగురించి చాకలి అడుగుతున్నాడు.

"మాఅన్న పంపాడురా బొంబాయినించి. పద్దు త్వరగా చెప్పు బాబు, కోప్పడతారు కాఫీ ఇవ్వకపోతే."

శాంత త్వరితపరుస్తోంది చాకలిని. కాని చాకలివాడు చీరని పొగడడం మానలేదు.

"తహసీల్దారుగారి బట్టలుకూడా నేనే ఉతుకుతున్నాను కదమ్మా. ఆరికేలేదిలాంటి చీర. బలేగుందమ్మా. ఖరీదెంతో!"

శాంత చాలా సంతోషించింది వాడు వెల్లడించిన నగ్నసత్యానికి. "అరవైఐదు రూపాయలటరా." అంది గర్వంగా.

నా గుండెలలో పిడుగుపడింది. వీడు వెళ్ళి తహసీల్దారు ఇంట్లో ఈ చీర సంగతి చెపితే ఆయనని కూతురు బ్రతకనివ్వదు. ఆయన నాతో చెప్పకమానడు. మా బావకో, నాకో, అరవై అయిదు రూపాయల ఆయుదం తప్పదు.

అందుకని బయటికివచ్చి "సరే కాని, అక్కడ చెప్పకురా ఈ చీరగురించి" అన్నాను చాకలితో.

చాకలి పెద్ద తెలిసినవాడిలాగా, "అలాగే నండి. నాకు తెల్దూ?" అన్నాడు. శాంత మాత్రం బుంగమూతిపెట్టి తొందరగా పద్దు వేస్తోంది. నిజంగా ఆమెకి కష్టం అనిపించి ఉంటుంది.

పద్దయాక చాకలి ఊరుకోక, "తహసీల్దారుగారు మొన్నకొన్నారు బాబు. వెంకయ్య కొట్లో. బలేచీర! అదీ ఏభై రూపాయిలేనండి. కాని, ఎంత బాగుందంటారు! అమ్మగారు కొనవలసిన..."

"ఏడిశావ్‌లే చాలించు. బాబుగారికి చీర లేవి కొందామా అనే ఆలోచన. అభిమానం ఎక్కువైపోతోంది" అని సగంకోపంతో అని, శాంత లోపలికి వెళ్ళిపోయింది.

చాకలి అదనుగ్రహించి, "ఇంకొక్కటే ఉందంట బాబూ. కావలిస్తే ఈవేళే వెళ్ళండి" అన్నాడు.

ఈమాటలు వింటో శాంత కాఫీ పట్టుకొచ్చింది. చేతికివ్వక, టేబిల్‌మీద ఉంచి మళ్ళీ వెళ్ళిపోయింది. వెనుదిరిగి చూచాను; ఆమెముఖంలో కోపరేఖలు కనిపిస్తున్నాయ్.

చాకలి వెళ్ళిపోయాడు. కాఫీ త్రాగాను. శాంత కోపానికి నవ్వు వచ్చింది.

సగం నవ్వుతో శాంతని పిల్చాను.

కోపంగానే వచ్చి కుర్చీలో కూర్చుంటూ

"ఏం?" అంది. నవ్వుతూ ఆమె కళ్ళల్లోకి చూశాను. ఆమె ముఖం త్రిప్పుకుంది.

"ఎందుకో ఆ కోపం?"

"ఎందుకైతే మీకెందుకు? మీ తహసీల్దారుకి కోపంరాకుండా ఉంటే సరిగా?"

ఆమె చీర గురించి చెప్పవద్దన్నానని కోపం వచ్చింది. లేచి, ఆమెముఖం బలవంతంగా నా వైపు త్రిప్పుకుంటూ, ఎందుకు వాడిని చెప్పవద్దన్నానో, అలాచెప్తే ఎంత డబ్బు నష్టమో విశదీకరించాను.

అమ్మయ్య శాంత నవ్వింది. "ఎంత జాగ్రత్త గలవారండీ మీరు!" అంటూ సిగ్గుగా నవ్వింది. నాగుండెలు తేలిక పడ్డాయి.

"అంతేకాని, నువ్వు అంత మంచి చీర కట్టుకుంటే నాకు సంతోషం కాదనుకున్నావా?"

"నిజంగా?" శాంత యెంత అమాయికంగానో అడిగింది.

"కాదూ?"

"అయితే నాకు మంచి చీరలు కొనడం మీ సంతోషానికే కాదూ?"

అంగీకరించాను.

నా చేతులని తప్పించుకుని, శాంత హఠాత్తుగా లేచింది. అద్దం, దువ్వెనా చేతికిస్తూ, "త్వరగా వెళ్తారేం" అంది.

తెల్లబోయాను. ఏమిటీ మేఘంలేని పిడుగు? అడిగాను "ఎక్కడికి?"కని.

"ఆ చీర... చాకలి చెప్పలా, వెంకయ్య కొట్లో. వేగం వచ్చేయండేం? మంచివారు కదూ?"

చొక్కా గుండీలు తనే పెట్టేసింది. బజారుకి బయలుదేరాను.

వెంకయ్య కొట్టు హడావుడిగా ఉంది.

యెలాగో బాధపడి, తహసీల్దార్ కొన్న చీర జతది తీయించాను. అదృష్టవశాత్తు వచ్చిన రెండిటిలోనూ ఇది మిగిలింది.

చీర చాలా బాగుంది. లేత బంగరువర్ణంలో నక్షత్రాలల్లే చిన్న చుక్కలు. పాము కుబుసంలాగా యెంతో సున్నితం. చాలా సేపు చీర చూస్తూ ఉండిపోయాను.

ఇంతట్లో ఎవరో వీపుమీద చెయ్యివేశారు. త్రుళ్ళిపడి చూశాను. తహసీల్దార్! నమస్కరించాను.

చీర దుకాణదారుడికి ఇప్పించి ఆయన నన్ను బయటికి తీసికెళ్ళాడు. "చీర కొంటున్నారా?" అన్నాడు గుమ్మం దాటాక.

ఆయన ఆఫీసులో హెడ్‌క్లర్కుని! ఇప్పటిదాకా వచ్చే రాబడి చెడకుండా, అగ్నిహోత్రం లాంటి మనిషి అనే పేరు పోకుండా కాపాడుకున్నాను. నా నూటముప్ఫై రూపాయిల జీతంలో ఇలాటి ఖరీదైన చీరలూ అవీ కొంటూన్నానంటే ఏడుస్తాడని, "లేదు సార్. ఊరికే చూస్తున్నాను" అన్నాను, నా తెలివికి సంతోషించుకుని.

ఆయన చిరునవ్వుతో హోటల్ లోకి దారితీశాడు. నన్ను నోరు యెత్తనివ్వకుండా టిఫిన్ ఆర్డర్ చెయ్యడం, హోటల్లో నాతో యెంతో చనువుగా మాటలాడడం నన్ను చకితుణ్ణి చేశాయి.

"అయినా, అలాటి చీరలమీద డబ్బు వేస్టు చెయ్యకు. ఒక్క రేవు పడేసరికి సరి వాటి పని!" అంటూ హితోపదేశం చేశారు.

నేను చాలా సంతోషించాను ఆయన హృదయ వైశాల్యానికి. అసలుగాఆయన చాలా మంచివాడని నిర్ధారణ చేసుకున్నాను. కాని, సాయంత్రం ఇంటి మెట్లు యెక్కుతూంటే నాకీ గతం అంతా మహా భయంకరంగా కనిపించింది.

తలుపు తీస్తూనే, సంతోషంగా శాంత "చీర యెక్కడ దాచారు?" అంది.

"వెంకయ్య అమ్మేశాడని చెపుదామనుకున్నాను. కాని, తహసీల్దారుగారమ్మాయి మా ఇంటికి రాకతప్పదు. అప్పుడు శాంతకి నిజము తెలియకా తప్పదు.

"ఆ చీర వర్తి చెత్త రకంట. ఇస్త్రీ చేసేసరికి చీర అంతా కన్నాలు పడిపోతాయట. ఆ డబ్బుతో మరొక చీర"

"ఇంక చాలు లెండి. కొనడం ఇష్టంలేదని చెప్పేయరాదూ?" అని కోపంగా అని, శాంత లోపలికి వెళ్ళిపోయింది. నాగుండెలలో రాయి పడింది. తహసీల్దారు సరిగ్గా ఆ సమయానికెందుకు రావాలి? నేనబద్ధం ఎందు కాడాలి?

పోనీ, ఇప్పుడు కొనేస్తే?

బాగానే ఉంది. కాని రేపీ సంగతి తహసీల్దారుకి తెలిస్తే ఏమనుకుంటాడు?

శాంత భోజనందగ్గర చాలా నిశ్శబ్దంగా ఉంది. అన్నం తినడం మానేసింది. చాలా కోపం వచ్చింది!

ఏమైతే అయిందని బయలుదేరాను. అదృష్ట వశాత్తూ వెంకయ్య కొట్టుతీసే ఉంది. ఆ చీర ఇమ్మన్నాను.

"సాయంత్రం అమ్మేశాము బాబూ, తమరు ఉంచమనలేదు!" అన్నాడు వెంకయ్య.

"ఎవరు తీసుకున్నారు?"

"తహసీల్దార్ గారండి."

ఎంత దగా!

బరువుగా వెనుదిరిగాను.

* * *

శాంత నాతో ఇప్పుడు చాలా ముభావంగా, ఉదాసీనంగా ఉంటోంది. తహసీల్దారు చీర కొన్న సంగతి ఆ మూడో నాడు తెలిసింది ఆమెకి. నామీద పూర్తిగా కోపం వచ్చేసింది శాంతకి.

అసలు ఆ చీర అమ్మకం అయిపోయిందని చెప్పేసి ఉంటే తగూ లేకపోను. ఇప్పుడు శాంత నన్ను వర్తి పీనారిగా జమకట్టి ఊరుకుంది.

గృహజీవితం నాకు నరకప్రాయ మయిపోయింది. ఉదయం కాఫీ సిద్ధంచేసి, వికసించిన పువ్వులాగ నవ్వుతో అందిచ్చే శాంత విధి లేక లాగ నాకు నే నే లేచి మొహంకడుక్కొన్నాక కాఫీ టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోతోంది. భోజనం దగ్గర ఎంతో చక్కగా మాటలాడుతూ, తినగలిగిన దానికంటే ఎక్కువ తినిపించే శాంత, మూగగా వడ్డించి, తన విధి నెరవేరుస్తోంది. సాయంత్రం ఇంటి వచ్చేసరికి ఆనందంగా స్వాగతం ఇచ్చేశాంత ఉదాసీనత్వంతో, తప్పనట్లుగా కాఫీ ఇచ్చి వంట ఇంట్లోకి వెళ్ళిపోతోంది.

శాంతకి నామీద అంత కోపం వచ్చినందుకు చాలా విచారించేను. ఆమె ప్రవర్తనకి కోపం రాలేదు కాని, జాలి వేసింది. రెండు మూడు సార్లు ఆమెని మాటలాడించడానికి ప్రయత్నించాను. కాని, నేను ఆమెని పట్టుకున్నప్పుడు ఆమె నిశ్శబ్దంగా ఉండిపోయి, నా ఉపన్యాసం రేడియో నివార్తలాగ విని, వెళ్ళిపోయేది.

చేసేం చేసేది?

వెంకయ్య దగ్గరకి మళ్ళా వెళ్ళి అలాంటి చీర ఇంకొకటి ఎలాగైనా తెప్పించమని చెప్పి, రూపాయలు ఇచ్చాను. వారం రోజులలో వస్తుందని చెప్పాడు వెంకయ్య. ఈ పరిస్థితి అంతం పొందడం అనేది ఉంటుందా అని భయపడుతూ ఆ వారమూ గడిపాను. శాంతతో ఈ విషయం, చీర వస్తుందని చెప్పకుండా ఊరుకున్నాను.

కాని, నాకు తహసీల్దార్ మీద చాలా కోపం వచ్చింది. మా పొరుగింటాయనా, ఆఫీసరూ అని ఊరుకున్నాను కాని, నా కింత మోసం చేసిన అతన్ని నాలుగు దులిపి ఉందును. "నాకీ చీర కావాలి; నీకింకోటి తెప్పించుకో" అని చెప్పేస్తే సరిపోను కదూ? నాకీ గొడవ రాకపోను!

ఒకనాడు సాయంత్రం ఆఫీస్‌లో "ఏము లాగుఉన్నారు?" అని అడిగాడు. వంట్లో బాగా లేదని బొంకాను. కాని సమయం వస్తే కసి తీర్చుకోడానికే ప్రయత్నించసాగాను.

ఆవేళ న్యాయంగా చీర రావాలి.

ఆశగా అడిగాను. వెంకయ్య చక్కగా కట్టిన పొట్లం యిస్తూ బిల్లు చేతికిచ్చాడు. సరిగ్గా అదేరకపు చీర అని చెప్పాడు.

ఆనందంగా ఇంటికి సాగాను. గదిలో పొట్లం దాచేశాను. శాంతకి ఎలాగ చెప్పడమా అని ఆలోచిస్తూ జోడు విప్పుకుంటున్నాను. చాకలి వచ్చి బట్టలు తీసికెళ్ళాడల్లే ఉంది– ఇల్లంతా తీర్చి దిద్దినట్లుంది.

శాంత ఆవతలి గదిలో పాడుతోంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది! ఇంత ప్రసన్నత ఎలాగ వచ్చింది? అని.

హఠాత్తుగా నా గదిలోకి పరిగెట్టుకుని వచ్చి, నవ్వుతూ శాంత "ఎంతసేపైపచ్చారు? కాఫీ అడగరేం?" అంది. అని వంటింట్లోకి పరిగెట్టింది.

కాఫీ, టిఫీన్, స్వీట్స్. ఏమిటిది?

"హోటల్ నించి తెప్పించాను లెండి. తినండి" మళ్ళా పూర్వపు ఆనందం.

ఏమిటీ మార్పు?

ఒకవేళ నా పని తెలిసిపోయిందా? తెలియదే. శెట్టితో మరీ చెప్పాను రహస్యం అని. అయితే?

ఆశ్చర్యంగా, తింటున్నాను.

ఒక్కసారి చల్లబడి, "మీరు చాలా తెలివైనవారండీ" అన్నది శాంత.

త్రుళ్ళిపడ్డాను. ఏమిటీ ధోరణి?

"పాపం మిమ్మల్ని బాధపెట్టాను కదూ పది రోజులు?"

శాంత ఆగిపోయింది. ఆమెకళ్ళు ఆర్ద్రిత గొంతులోని గాద్గదికమూ నన్ను చకితుణ్ణి చేశాయి.

"మీరు అబద్ధం ఆడేరనుకుని అలాగ ప్రవర్తించాను. పాడుచీర కోసం ఎంత బాధ పెట్టాను కొనడం ఇష్టం లేదనుకుని."

ఆమె మాటలని మళ్ళా కన్నీళ్లు అడ్డగించాయి. ఆమెముఖంలో ద్యోతకం అవుతూన్న పశ్చాత్తాపంతో కూడిన దీనత్వం నన్ను బాధించసాగింది.

"ఏమిటీ శాంతా అది? ఎందుకలాగవుతావు? ఆచీర..."

శాంత నన్ను మధ్యలో ఆపింది.

"ఆ చీర తడిపి ఇస్త్రీ చేసేసరికి నిండా తూట్లు పడ్డాయని చాకలి చెప్పాడు. అరవై రూపాయిలకి చూసుకున్నా రనుకున్నాను. కాని మీకు బట్టల సంగతి బాగా తెల్సునని అనుకోలేదు."

తూట్లు! నా ముఖం తిరిగింది. ఏమంటాను?

ఆ చీరని శెట్టి వాపస్ పుచ్చుకోకపోతే శాంతకి తెలియకుండా ఇంట్లో దాచడానికి అవస్థ పడిపడి, ఓ శుభదినాన్ని ఒక మిత్రుడి వివాహంలో బహుమతి చేశాను.

# ఎగుడు దిగుడులు

కాళోజీ

అన్నపు రాసులు వొకచోట
ఆకలి మంటలు వొకచోట
హంసతూలికలు వొకచోట
అలసిన దేహాలొకచోట
వాసన నూనెలు వొకచోట
మాసిన తలలింకొకచోట
సంపదలన్నీ వొకచోట
గంపెడు బలగం వొకచోట
కమ్మని చకిలా లొకచోట
గట్టిదవడ లింకొకచోట
కామిని వాంఛలు వొకచోట
కాగిలింత లింకొకచోట
సాహితీ నిలయం వొకచోట
సాహితీపరు లింకొకచోట
కళాప్రదర్శన మొకచోట
కళారాధకులు వొకచోట
సత్తువలంతా వొకచోట
పెత్తనమంత ఇంకొకచోట.